# భారతీయ భాషలలో
# తొలితరం నవలలు

ఎమ్. శ్రీధర్

ఎమెస్కో

# విషయసూచిక


భారతీయ భాషలలో తొలితరం నవలలు:
తులనాత్మక పరిచయం 5

నవలా చరిత్ర అవసరాన్ని మళ్లీ గుర్తుకు తెచ్చే రచన 10

1. ఫసానా–ఈ–రంగీన్ (పర్షియన్) 19
2. యమునా పర్యటన్ (మరాఠీ) 23
3. దుర్గేశ్ నందిని (బాంగ్లా) 28
4. కరన్‌ఘేలో (గుజరాతీ) 32
5. మిరాత్ ఉల్–ఉరూస్(ఉర్దూ) 36
6. ఉస్ బ్రాహమన్స్, రొమాన్స్ (పోర్చుగీస్) 40
7. శ్రీ రంగరాజ చరిత్రము (తెలుగు) 43
8. లా జూర్నాల్ ద మాద్‌మొజేల్ దార్‌వేర్ (ఫ్రెంచ్) 47
9. ప్రతాప ముదలియార్ చరిత్రము (తమిళం) 50
10. పద్మమాలి (ఒడియా) 53
11. చంద్రకాంత (హిందీ) 57
12. సరస్వతీవిజయం (మలయాళం) 60
13. సగుణ (ఇంగ్లీషు) 65
14. మిరీ జియోరి (అస్సామీ) 69
15. ఇందిరా బాయ్ (కన్నడం) 72
16. సతీ కమలె (తుళు) 75

# ఫసానా–ఈ–రంగీన్ (పర్షియన్)

హసన్ షా రాసిన ఫసానా–ఈ–రంగీన్ (పర్షియన్) నవలను ప్రముఖ ఉర్దూ రచయిత్రి ఖురతులైన్ హైదర్ తొలి భారతీయ ఆధునిక నవలగా గుర్తించి 1790లో రచింపబడిన ఈ నవలకు సజ్జాద్ హుస్సేన్ కస్మందావి నష్టార్ పేరుతో చేసిన ఉర్దూ అనువాదాన్ని మరో వంద సంవత్సరాల తర్వాత 1993లో *The Dancing Girl* పేరుతో ఇంగ్లీషులోనికి అనువదించారు. పర్షియన్ నవలను రాసిన హసన్ షా అప్పటి ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారి మింగ్ (మానింగ్) వద్ద కాన్పూర్‌లో మున్షీ (గుమాస్తా)గా పనిచేశాడు. తమ కొలువులో భోగం వాళ్ళను ఉంచుకొనే సంప్రదాయం మొగల్ చక్రవర్తులు, వారి సామంత రాజులు పాటించేవారు. 1764లో బక్సర్ యుద్ధం తరువాత తమ అధికారాన్ని ఈస్ట్ ఇండియా కంపెనీ సుస్థిరం చేసుకుంటున్న రోజులవి. భోగం వాళ్ళను పోషించే సంప్రదాయాన్ని కంపెనీ పాలకులు కొనసాగించారు. ఈ నర్తకబృందాలు పంజాబ్, సింధ్ ప్రాంతాలనుండి వచ్చే సంచార జాతులకు, కాశ్మీరు ప్రాంతం నుంచి అప్పుడప్పుడు వచ్చి స్థిరపడే వలసవాసులకు చెందినవారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వీరు వారి అందం, తెలివితేటలతో హాఫీజ్ వంటి పర్షియన్ కవుల రచనలను, గజళ్ళను, హిందీ పాటలను గానం చేస్తూ నాట్యం చేసేవారు. ఈ నవల కథానాయిక ఖానూమ్ జాన్ అటువంటి కుటుంబాలకు చెందినది.

హసన్ షా నిజ జీవితంలో తనకు, ఖానూమ్ జాన్‌కు మధ్య మొలకెత్తిన ప్రేమ, వారి రహస్య వివాహం, ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యం కాన్పూర్‌నుంచి తరలించే నిర్ణయం వల్ల ఖానూమ్ జాన్ నాట్య బృందం కాన్పూర్ నుంచి వెళ్ళి పోవడం, తన పని వత్తిడి వల్ల ఆమెను అనుసరించి వెళ్ళలేక పోవడం, ఆమె వెళ్ళిన పడవ కంటె వేగంగా వెళ్ళ గలిగిన పడవలో కొన్ని రోజుల తరువాత బయల్దేరి ఆ పడవను చేరుకోవాలనే పథకం విఫలం కావడంతో ఆమెను చేరుకోలేక పోవడం, చునార్‌కు చేరుకున్న ఖానూమ్ జాన్ ఆరోగ్యం అక్కడి వాతావరణం సరిపడక క్షీణించడం, హసన్ షాను కడసారి చూడాలనే ఆమె కోరిక నెరవేరకుండానే ఖానూమ్ జాన్ చనిపోవడం వంటి సంఘటనలను ఆధారంగా చేసుకుని రాసిన ఈ రచన ఆత్మకథాత్మక నవల.

ఖానూమ్ జాన్ భోగం వృత్తితో జీవనం గడుపుతున్న చమేలీ జాన్, తన వ్యాపారంలో నష్టపోయి అప్పుడు ఖానూమ్ జాన్‌తో బాటు నర్తకుల కంపెనీ నిర్వహిస్తున్న ఆజంజీల పెంపుడు కూతురు. వారితోబాటు కాశ్మీరునుండి వచ్చిన మీర్జాయ్‌తో కూడ ఆజమ్‌కు సంబంధం ఉండేది. నవల ప్రారంభమయ్యేటప్పటికి ఆ బృందంలోని గుల్బదన్‌ను ఉంచుకున్నందుకు కల్లన్ సాహెబ్ (కాలిన్స్) నెలకు ఆమెకు మూడు వందల రూపాయలు, ఖానూమ్ జాన్‌కు చిల్లర ఖర్చులకుగాను నెలకు యాభై రూపాయలే గాక, వారానికో ప్రదర్శనకుగాను ముప్పై రూపాయలు ఇచ్చేవాడు. ఖానూమ్ జాన్ పుట్టినరోజున పూజారులకు చేసే విందులో భాగంగా సయ్యద్‌ల వంశానికి చెందిన, మింగ్ సాహెబ్ వద్ద పనిచేస్తున్న, హసన్ షాను అతని ఆశీర్వచనాలు స్వీకరించేందుకు రమ్మంటారు. ఖానూమ్ జాన్‌ను చూచిన వెంటనే హసన్ షా తక్షణ ప్రేమలో పడతాడు. ఇలా ఉండగా గుల్బదన్ ఒక ఇంగ్లీషు వానితో వెళ్ళి పోవడం వల్ల నాట్య బృందానికి ఆర్థికంగా చిక్కులు వచ్చి పడతాయి. ప్రేమలో పడ్డ హసన్ షా మితూ అనే మధ్యవర్తి ద్వారా ఆ నాట్య బృందాన్ని మింగ్ సాహెబ్ పోషించే విధంగా చేసుకుంటాడు. ఖానూమ్ జాన్ గజళ్ళ పరిజ్ఞానం ఆమె అందానికి తోడై మింగ్‌ను ఆకర్షిస్తుంది. కానీ ఖానూమ్ జాన్ అతని ప్రేమను నిరాకరిస్తుంది. మింగ్ అప్పుడు ఖానూమ్ జాన్‌కు బదులుగా బీజాన్‌ను నెలకు వంద రూపాయల జీతంతో ఉంచుకుంటాడు. ఈ ఏర్పాటు వల్ల, ఖానూమ్ జాన్‌కు నెలకు రెండు వందల యాభై రూపాయలు ఇచ్చేట్టు అంతకు ముందు ఆజంజీ, చమేలీ జాన్‌లు కుదుర్చుకున్న ఒప్పందం విఫలం కావడంతో వారి బృందం ఆర్థికంగా ఇబ్బందులకు లోనవుతుంది. ఈ పరిస్థితులలో మొదట ఖానూమ్ జాన్‌కు నెలకు యాభై రూపాయలు మాత్రమే ఇస్తానన్న మింగ్, ఆమె సంభాషణా చాతుర్యాన్ని పరిగణలోనికి తీసుకుని ఆమె జీతాన్ని వంద రూపాయలకు పెంచుతాడు. ఈ విధంగా ఖానూమ్ జాన్ మానం సంరక్షించబడడమే కాక బృందం ఆర్థిక పరిస్థితులు మెరుగు కావడం హసన్ షాను సంతోష పరుస్తుంది.

హసన్ షా తనను పెళ్ళి చేసుకొంటానన్నప్పుడు ఖానూమ్ జాన్ అతణ్ణి తన సాంఘిక హోదాకు తగిన పిల్లను చేసుకోమంటుంది. అప్పుడు హసన్ షా ఆమెలో ఉన్న ఆత్మగౌరవం, సౌమ్య గుణం, మానాన్ని కాపాడుకోగల తెలివితేటలు, మృదుభాషణా చాతుర్యం వంటి గుణాలను గుర్తిస్తూనే, అట్టి గుణాలు ఏ కోశానా ఉండజాలని జాతిలో ఆమె ఇరుక్కుపోవడం దురదృష్టం అంటాడు. సాంఘిక, ఆర్థిక అంతరాలు ఆయా పాత్రల మనోభావాల్ని ఎలా రూపుదిద్దుతాయో వీరి మాటల్లో అర్థమవుతుంది.